క్లుప్తంగా

బాధిత కుటుంబానికి రాజా పరామర్శ



ఇండుగపల్లిలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దాడిశెట్టి రాజా

కోటనందూరు: మండలంలో ఇండుగపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గొంప అప్పలనాయుడు ఇటీవల ఆనారోగ్యం కారణంగా మృతి చెందాడు. ఈ మేరకు శనివారం అప్పలనాయుడు కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పరామర్శించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకుని ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీను, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, నాయకులు కుంచే అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారుల గైర్హాజర్



మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓలు

జగ్గంపేట: వర్షాకాలం నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ చేపడుతున్న పనులపై శనివారం మండల సమావేశాన్ని జెడ్పీటీసీ మండల పరిషత్ అధ్యక్షుడు అత్సులూరి నాగబాబు అధ్యక్షతన నిర్వహించారు. కాలవలు, చెరువుల పరిస్థితి, తదితర అభివృద్ధి పనులపై ప్రధానంగా సమావేశంలో చర్చించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఇరిగేషన్ అధికారులు గైర్హాజరు కావడం సరికాదని జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బింధుమాధవి మండిపడ్డారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఏఐ టూల్స్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్రాజెక్ట్ ప్రాపోసల్ రైటింగ్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పుదుచ్చేరికి చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ వివి హరి గోవిందన్ పాల్గొని ఉపాధ్యాయులకు ప్రాజెక్ట్ ప్రాపోసల్ ఏలా రాయాలో అనే అంశంపై మెళుకువల గురించి వివరించినట్టు తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన చైర్‌పర్సన్



తునిలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ భువన సుందరి

తుని: ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వాలంబన సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అన్నారు. శనివారం ఈసేవ కేంద్రంపైన ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలు తయారు చేసిన వస్త్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న డిజైన్ల తయారీలో మహిళలకు శిక్షణ ఇవ్వాలని ఇన్విజిలేటరుకు చైర్‌పర్సన్ సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ఏఓ



గండేపల్లి నూతన ఏఓ శ్రీరామ్

గండేపల్లి: గండేపల్లి మండల వ్యవసాయాధికారిగా ఆర్. శ్రీరామ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జగ్గంపేట ఏఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చిన ఆయనను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. గతంలో ఏఓగా విధులు నిర్వహించిన సద్గురుమూర్తి కె.గంగవరం మండలానికి బదిలీపై వెళ్లినట్టు సిబ్బంది పేర్కొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

పెద్దాపురం: మండలంలోని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ అల్యూమినియం కంపెనీ ఈ సెలెక్షన్స్ నిర్వహించిందన్నారు. తమ కళాశాలకు చెందిన 20 మందితో పాటు, ఇతర కళాశాలల విద్యార్థులు ఎంపికై నట్లు చెప్పారు. ఎంపికైన వారిని చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రెడ్డి అభినందించారు.

గ్రోయిన్ల నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- శిథిలావస్థలో గ్రోయిన్ల వ్యవస్థ
- ఏటా రైతులకు తప్పని సాగునీటి అవస్థలు
- 12 వేల ఎకరాల్లో వరిసాగు ప్రశ్నార్థకం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తాండవ నదిపై శిథిలావస్థలో ఉన్న కామినీడువారి గ్రోయిన్

కోటనందూరు: అధికారుల అలసత్వం తాండవ గ్రోయిన్ల కింద ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారింది. మెట్ట ప్రాంతం కోటనందూరు, తుని మండలాల్లో సాగునీటి వసతి లేని రైతులకు తాండవ నదిలో వృథాగా పోతున్న నీటిని మళ్లించి సాగునీరుగా అందించేందుకు బ్రిటీష్ కాలంలో తాండవ నదిలో గ్రోయిన్లను నిర్మించారు. కాలక్రమంలో ఈ గ్రోయిన్లు శిథిలావస్థకు చేరాయి. ఈ గ్రోయిన్ల కింద వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గ్రోయిన్లు శిథిలావస్థకు చేరడంతో గత పదేళ్లగా గ్రోయిన్ల కింద ఆయకట్టు రైతులు ఖరీఫ్‌లో సాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులు శ్రమదానం, సొంతఖర్చుతో గ్రోయిన్ల దగ్గర ఇసుక బస్తాలు వేసుకొని నీటిని మళ్లించుకుంటున్నారు. సమస్యను రైతులు ఏటా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో గ్రోయిన్ల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రైతులు భావించినా ఇప్పటి వరకూ ఆ దిశగా అడుగులు పడలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పాలకులు, అధికారులు గ్రోయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఇసుక మాఫియా ఆగడాలు

తాండవ జలాశయ పరిధిలో తుని నియోజకవర్గంలో 30 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఇందులో 18 వేల ఎకరాల ఆయకట్టుకు తాండవ జలాశయం నుంచి కోటనందూరు, భీమవరపుకోట, ఇండుగపల్లి మేజర్ కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 12 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఆరు దశాబ్దాల క్రితం తాండవ నదిపై అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలోని నిమ్మకట్టుతో పాటు మండలంలో అల్లిపూడి, కొట్టాం, కోటనందూరు, కామినీడు, దిగువాయి గ్రోయిన్లు నిర్మించారు. అయితే కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ గ్రోయిన్ల పరిసర ప్రాంతంలో విచ్చల విడిగా ఇసుక తవ్వకాలు జరుగుతుండడంతో శిథిలమైపోయాయి. గత 20 ఏళ్లగా ఇదే పరిస్థితి కొనసాగుతూ వస్తోంది. ఈ దుస్థితితో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా రైతులు సాగు నీటికోసం అష్టకష్టాలు పడక తప్పడం లేదు. నదిలో నీటిని గ్రోయిన్ల ద్వారా పొలాలకు మళ్లించకపోతే పంటలు ఎండిపోతాయి.

అధికార నేతలే కాంట్రాక్టర్లు

గత చరిత్ర గమనిస్తే శిథిలమైపోతున్న గ్రోయిన్లను నిర్మించేందుకు అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా వ్యవహరించారు. కంటి తుడుపు చర్యగా నాశిరకం మెటీరియల్‌తో లోపభూయిష్టంగా చేసిన పనులు ఏడాది లోపే ఏటిలో కొట్టుకుపోయేవి. మరళా తరువాత ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు గోల చేయడం, అధికారులు ప్రణాళికలు తయారు చేయడం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పరిపాటిగా మారింది. ఇలా ప్రతీ ఏడాది గ్రోయిన్ల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడం, సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడడం సరా మామూలుగా మారింది. ఇప్పటికీ రైతులు ఏటా వర్షాభావ పరిస్థితుల్లో గ్రోయిన్ల దగ్గర ఇసుక బస్తాలు వేసుకొని సాగునీటిని మళ్లించుకునే దయనీయ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



తాండవ నదిలో అడ్డగోలుగా జరుపుతున్న ఇసుక తవ్వకాలతో కోట్ల రూపాయలతో నిర్మించిన గ్రోయిన్లు శిథిలమయ్యాయి. గ్రోయిన్లు సక్రమంగా లేక ఏటా సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరిపంట నీరందక ఎండిపోయే పరిస్థితులు ఏటా ఎదురవుతున్నాయి. పట్టించుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు.

–రామసూరి సత్యన్నారాయణ, రైతు, బొద్దవరం

పుట్టగొడుగుల్లా అనధికార మార్గాలు

- ప్రమాదాలకు నిలయంగా అనధికార మార్గాలు
- చోద్యం చూస్తున్న హైవే అథారిటీ అధికారులు



తాళ్లూరులో ఐరన్ గ్రిల్స్‌ను తొలగించి రహదారి ఏర్పాటుకు యంత్రంతో పనులు చేస్తున్న దృశ్యం

గండేపల్లి: హైవేపై అనధికార మార్గాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నప్పటికి హైవే అథారిటీ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో అవి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. వ్యాపారస్థులు తమ అవసరాలకోసం అప్పటికప్పుడు మార్గాలను ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నప్పటికి అధికారులు మాత్రం ఏమాత్రం పట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. మండలంలోని తాళ్లూరులో డెక్కల పోలమ్మ ఆలయ సమీపంలో గల షాపుల వద్ద అనధికార మార్గం ఏర్పాటుకు రోడ్డు పక్కనే భద్రత కోసం ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్‌ను షాపుల నిర్మాణం కోసం అప్పట్లో తొలగించినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో గల ఊరచెరువుకు సమీపంలో నిర్మితమవుతున్న ప్రైవేటు పాఠశాల నిర్వాహకులు స్కూల్ బస్సుల రాకపోకల నిమిత్తం ఇదే ప్రదేశంలో మట్టి వేసి రోడ్డు రోలర్‌తో పనులు చేయిస్తున్నట్టు పేర్కొన్నారు. అనధికార మార్గం నుంచి విద్యార్థులతో స్కూల్ బస్సులు రోడ్డుపైకి రావాలంటే ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవల్సిందేనని తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. పొట్ట కూటికోసం హైవేకి దూరంగా తాత్కాలికంగా వ్యాపారాలు సాగించే వారిపై హైవే అధికారులు తమ ప్రతాపం చూపిస్తారని, ఇటువంటి ప్రమాదకర మార్గాలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్పందించి చర్యలు తీసుకొవాలని కోరుతున్నారు.

రెప్పపాటులో తప్పిన ప్రమాదం



తాళ్లూరులో హైవే పక్కన పంట కాలువలో బోల్తా కొట్టిన ట్రాలీ

గండేపల్లి: చిన్న నిర్లక్ష్యం జీవితంలో భారీ మూల్యాన్ని చెల్లించే పరిస్థితిని తెస్తుంది. ముఖ్యంగా రోడ్డుపై ప్రయాణించే సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ప్రమాదమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాంటి ఘటనే శుక్రవారం హైవేపై అర్ధరాత్రి జరిగింది. రెప్పపాటు నిర్లక్ష్యంతో ప్రాణ నష్టం తప్పింది. రోడ్డు సేఫ్టీ సిబ్బంది వివరాల మేరకు విశాఖ వైపు నుంచి విజయవాడ వైపు ఐరన్ లోడుతో వెళుతున్న ట్రాలీ మండలంలోని తాళ్లూరు వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు నిద్రమత్తు కారణంగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీ కొట్టి పంట కాలువలోకి దూసుకెళ్లి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడగా ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని సిబ్బంది తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



తుని ఆర్టీసీ డిపో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది



ఆలయ ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న ఉద్యోగులు



ప్రత్తిపాడు వెలుగు కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ కుమార్‌బాబు

తుని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ డిపో పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. ఆవరణలో నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించారు. డిపో ప్రాంగణంలో మొక్కలు నాటి నీళ్లు పోసారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ బస్సులతో పాటు డిపో ప్రాంగణంలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి, ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్ ఇంచార్జిలు, సిబ్బంది పాల్గొన్నారు.

లోవ ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర

తుని రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. నేడు మూడో శనివారం కావడంతో తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ పి.విశ్వనాధరాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆలయా ప్రాంగణాలను శుభ్రపర్చారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి దగ్ధం చేశారు. గ్రామాల్లో ఎంపీడీఓ కె.సాయి నవీన్, డిప్యూటీ ఎంపీడీఓ మరిడియ్య, ఆయా కార్యదర్శుల ఆధ్వర్యంలో సచివాలయాల ప్రాంగణాలు, గ్రామాల్లో చెత్త వ్యర్థాలను తొలగించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతకై గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రత్తిపాడు: పచ్చదనం పరిరక్షణ ప్రజలందరీ బాధ్యత అని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు చెప్పారు. ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, నాటిన మొక్క పెరుగుదలకు కూడా బాధ్యత వహించాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడులోని వెలుగు కార్యాలయం వద్ద శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చెపట్టారు. కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ కుమార్ బాబు మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత కోసం గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఈఓపీఆర్డి కేవీవీ కాశీ విశ్వనాధం, ఎంపీఓ వి రాజబాబు, ఏపీఎం వెంకట్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

గోకవరం: మండలంలోని పలు విష్ణు ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. జ్యేష్ఠమాసం ఏకాదశి తిథిని పురస్కరించుకుని మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డిలోని వల్మీక వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం కావడంతో విశేష సంఖ్యలో భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చి ప్రదిక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తిరుమలాయపాలెంలో లక్ష్మీ సమేత వరాహస్వామి ఆలయానికి భక్తులు భారీ ఎత్తున వచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మానసిక శాంతికి యోగా దోహదం



యోగాసనాలు నిర్వహిస్తున్న ప్రగతి కళాశాల విద్యార్థులు, సిబ్బంది



రౌతులపూడి-2 సచివాలయం వద్ద ఆసనాలు వేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది



వీరవరం పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న ఎంపీపీ తోట రవి



వి.కొత్తూరు కేజీబీవీలో వినూత్నంగా విద్యార్థినుల యోగాసనాలు

గండేపల్లి: మానవుడి జీవితంలో మానసిక శాంతికి యోగా దోహదపడుతుందని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు సూచించారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మనస్సును స్థిరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవి హరనాధబాబు, కె సత్యనారాయణ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్నందించేది యోగా

రౌతులపూడి: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ప్రతి పల్లెలోను శనివారం యోగా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, పాఠశాలల్లోనూ, ఉపాధి హామీ పనులవద్ద యోగదినోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆరోగ్యాన్నందించే వివిధ ఆసనాలును వేసి యోగా విశిష్టతను చాటారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ, అంగన్‌వాడీ, వెలుగు, ఉపాధి, సిబ్బందితో బాటు ఉపాధి కూలీలు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాలలో యోగా దినోత్సవం

కిర్లంపూడి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థానిక ప్రజలతో కలిసి శనివారం ఉదయం యోగాసనాలు నిర్వహించారు. ఈ మేరకు వీరవరంలోని జెట్పీహెచ్ స్కూల్‌లో ఎంపీడీఓ హెచ్ హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేసి వాటి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్నంగా యోగా దినోత్సవం

తుని రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. శనివారం వి.కొత్తూరు కేజీబీవీలో ప్రిన్సిపాల్ అమృతవాణి ఆధ్వర్యంలో విద్యార్థినులు వినూత్నంగా యోగాసనాలు వేశారు. రాపాక, వి.కొత్తూరు తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. వల్లూరులో జరిగిన యోగా దినోత్సవంలో ఎంపీడీఓ కె.సాయినవీన్, డిప్యూటీ ఎంపీడీఓ జి.మరిడియ్య, హెచ్ఎంలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

తుని: యోగాతో మెరుగైన ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక గరల్స్ హైస్కూల్లో భారత వికాస్ పరిషత్, స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగాను దిన చర్యలో ఓ భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా వక్తలు సూచించారు. యోగా గురువులను నిర్వహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు చండక గురుమూర్తి, హెచ్ఎం జయంతి, భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు గాజుల వేణుగోపాలస్వామి, నెల్లిపూడి నాగేశ్వరరావు, చదరం శివాజీ, ఆశిన సత్యన్నారాయణ, కుందెం సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామానా యోగాసనాలు

ఏలేశ్వరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే గ్రామగ్రామాన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఏలేశ్వరం నగర పంచాయతీలో మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో, ఏలేశ్వరం పబ్లిక్‌స్కూల్‌లో కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో, తూర్పు లక్ష్మీపురంలో ఎంపీడీఓ సూర్యనారాయణ విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రతిరోజూ విధిగా చేయాలన్నారు.

యోగాతో బీపీ, షుగర్‌కు చెక్

అన్నవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అన్నవరం దేవస్థానంలో శనివారం దేవస్థానం సిబ్బంది యోగాసనాలు వేశారు. సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక ముందు గల విశ్రాంతి షెడ్డులో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, ఇతర సిబ్బంది యోగాసనాలు నిర్వహించారు. యోగాతో శారీరకంగా, మానసికంగా ఉత్తేజం కలుగుతుందని బీపీ, షుగర్ వంటి వ్యాధులు దరి చేరవని యోగా ట్రైనర్ పేర్కొన్నారు. దేవస్థానం నిర్వహిస్తున్న హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లోనూ విద్యార్థలతో అధ్యాపకులు యోగాసనాలు వేయించారు.



రత్నగిరిపై యోగాసనాలు వేస్తున్న ఈఓ సుబ్బారావు, సిబ్బంది

యువత పోరును విజయవంతం చేయాలి



వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఇంచార్జి ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: కాకినాడ కలెక్టరేట్ వద్ద ఈ నెల 23న వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు ఇంచార్జి ముద్రగడ గిరిబాబు శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఇస్తానని, ప్రతి ఏటా జనవరి 1న నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తానని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ఏడాది గడుస్తున్న నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో కూటమి పూర్తిగా విఫలమయిందన్నారు. దీనికి నిరసనగా పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు యువజన, విద్యార్థి విభాగ నాయకులు సమన్వయంతో పనిచేసి యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించాలని ఆయా విభాగాల నాయకులను కోరారు. పెద్ద ఎత్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ కార్యదర్శిగా బాబూరావు



పాతకొట్టాంలో బాబూరావును అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

కోటనందూరు: వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పిట్టం బాబూరావును మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం సత్కరించాయి. గిరిజన గ్రామం సంగవాకకు చెందిన గిరిజన ప్రతినిధి బాబూరావును పాతకొట్టాంలో లోవ దేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, సర్పంచ్ పసగడుగుల వరహాలు, ఎంపీటీసీ దొగ్గా రామకృష్ణ తదితరులు శాలువ, పూల మాలలతో సత్కరించి శుభాంకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకముంచి పదవి కట్టబెట్టిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు ఈ సందర్భంగా బాబూరావు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన తండాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవోపేతంగా గంగాలమ్మ గావు సంబరం



కత్తిపూడిలో గంగాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో వేంచేసియున్న గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూలు, పండ్లు, పసుపు, కుంకుమలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని పూల దండలు, విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి ప్రతిమగా కొలిచే బుట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజులు పాటు గావు సంబరం జరుగుతుందన్నారు.

ఎస్బీఐ మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ

జగ్గంపేట : జగ్గంపేట స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా ఎస్.నవీన్ కుమార్ శనివారం భాధ్యతలు చేపట్టారు. కోరుకొండ బ్రాంచీ నుంచి జగ్గంపేటకు బదీలపై రాగా, ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సత్యప్రసాద్ అమలాపురంలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారని సిబ్బంది తెలిపారు.

బీజేపీ కార్యవర్గ సభ్యుడి మృతి



గున్నాబత్తుల రాజుబాబు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గున్నాబత్తుల రాజుబాబు (45) మృతి చెందాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై ప్రత్తిపాడు నుంచి ఉత్తరకంచి వస్తుండగా ఒమ్మంగి శివాలయం దాటిన తర్వాత గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌ను వాహనం కొంత దూరం ఈడ్చుకుపోగా రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన రాజుబాబును స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనతరం మెరుగైన వైద్య నిమిత్తంం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. రాజుబాబు 20 ఏళ్లపాటు బీజేపీలో క్రియాశీలకంగా పనిచేశారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేసిన ఆయన మృతికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, క్రరి ధర్మరాజు, కందా వీరాస్వామి, గ్రామ సర్పంచ్ మంతిన వెంకటరమణ, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ల అప్పారావు, తదితరులు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య శ్రీవల్లీ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.